పెద్ద కథ :

# రామారావు చెప్పని కథ

## (చైతన్య స్రవంతిలో రచన)

### శ్రీ పి. యస్. శాస్త్రి

(గత సంచిక తరువాయి)

## భాగం 3

అబ్బ! అమ్మ! హాయిహాయిగా వుంది కదా! వేణ్ణీళ్ల స్నానం ఎంత బావుం దెంతబావుంది!...ఏమిటినా లోలోని వేదాంతీ? గుడుగుడుమంటా వెందుకు? అల్పసంతోషినా నేను? 'మాయామేయ జగంబె నిత్యమని' అని ఎవరో కవిగారు చెప్పినట్టు దేహానికి కలుగుతున్న అత్యల్ప సుఖములకే ముగ్ధుడనై మౌఢ్యములో నడుచుంటినా? ఆత్మకు ఈ శరీర సుఖదుఃఖాలు అంటవూ? బావుంది నాయనా! ఆత్మ యీ శరీరంలో వుండదూ? వేణ్ణీళ్లు మరీ వేడిగా వుండి వొళ్లు చురుక్కుమంటే ఘొల్లుమని గోల పెడతాం గదా! మరి అప్పుడు? అది ఆత్మ ఘోష కాదూ?...'లేదు మిత్రమా రామం! ఆత్మ సర్వదా సాక్షిరూపియై చిదానందమున సర్వమును తిలకించు చుండును! నీవు మాయలో మునుగుటచే భ్రమలోపడి ఒళు చురుక్కుమన్నట్టు భావించెదవు అంతే!'...ఒహో! అద్వైతం తలకెక్కింది!' అర్థం కానిదల్లా అద్వైతం' అని వో మిత్రుడి నిర్వచనం! నిజమేనా? పోనిద్దూ వేదాంతం అద్వైతాల సంగతి యిప్పుడెందుకు! 'వానప్రస్థాశ్రమమున విశ్రాంతిగా కూర్చుండి గంభీర అద్వైత గ్రంథముల పఠింపనోపు!...' అది అదీ మిష్టర్ రామారావ్! అచ్చమైన భారతీయుడవని పించావ్! చేసే వెధవ పన్లు అన్నీచేసి అప్పుడూ పాప ప్రక్షాళనం'...' కాదయ్యా వేదాంతీ! కంగారు పడకు నే చెప్పేది వినిపించుకో! సంసారములోమున్న యువకులకు వేదాంతం, ప్రత్యేకం అద్వైతం అసలు కుదరదు! 'ఏకమేవా అద్వితీయం బ్రహ్మ' అనుకుంటూ సర్వం నీలోని పరమాత్మే అని తెలిసీ తెలియని వేదాంతంలోకి వెడితే పెళ్లాంతో కాపరం చెయ్యటం కష్టమే, పిల్లల్ని కోప్పడటం కష్టమే!' 'నేస్తం అద్వైతం మనకొద్దు ప్రస్తుతం!'

'ఓయ్ ఓయ్! వస్తున్నామణీ! ఒక్కనిముషం!' 'తొందరపడవయ్యా రామారావ్! లేకపోతే దోసెలు చల్లారి పోవటం తథ్యం! దోసెలు చల్లారినా శ్రీమతి వాక్కులు వేడివేడిగా వుండటం సత్యం!'

...అమ్మయ్య! 'దోసెలు పులిహోర దద్ధోజనాలతో ఆరగింపవయ్య రామరాయ!' పద్యంగా రాయబోయి గేయంగా మార్చాను'గాయంతి గేయం! కనుక పాడుకో గలిగింది గేయమే! నేటి కవుల కెవరికీ తీసిపోను నేను! వెనకాల రాగతాళాలు ఏర్పరిచి అరవై రకాల వాయిద్యాలు పెడితే అమోఘంగా అనిపిస్తుంది. ఏ చెత్త అయినా! ఇప్పటి సినిమాలు చూడరాదూ? దోసె వెనుక ఒక డోసు కాఫీ 'ఓహో అద్భుతంగా వుంది! స్వర్గం కనిపిస్తోంది! 'మాయ! మాయ' అని వేదాంతి గాడెంత ఏడ్చినా సరే! ఈ సుఖాలే నా కిష్టం! ఓహో! జీవితం సంసారం ఎంత సుఖప్రదములు

రైట్ బావుంది! బ్రహ్మాండంగా వుంది! కొద్దిగా వక్కపొడికూడా సేవిద్దాం! 'నైస్ ఫినిషింగ్ ఫర్ నైస్ బ్రేక్‌ఫాస్ట్!' 'కమాన్ ప్రొసీడ్ టు ఆఫీస్!' ఆలస్యం అమృతం విషం! కాస్సేపాగితే శ్రీమతితో యేదేనా పేచీ రావచ్చు. ఏ యూనియన్ వాళ్లో 'బంద్' కాని హర్తాళ్ కాని ఏర్పాటు చెయ్యచ్చు! అప్పుడు ఛస్తే ఆఫీసుకు వెళ్లలేం, ఆ వెనకాల చచ్చినట్టు ఆఫీసుకు శెలవు పెట్టాలి!.........

...'హమ్మయ్య! ఉదయం కార్యక్రమం పూర్తి చేసాం!' 'ఇంక మార్నింగ్ ట్రాన్స్మిషన్' ష్! ఆంధ్రదేశంలో తెలుగు కాలేజీల్లో మాధ్యమం (మీడియంకు తెలుగుట!) కనుక 'ఉదయ ప్రసారం' అందాం ఆకాశవాణి విజయవాడ కేంద్రంలా!... 'రాళ్ళూ రప్పల; గతుకుల; గోతుల రోడ్డు పై మన రాలీ సైకిల్ పోనిద్దాం!...' ఏదో సినిమాలో యన్టీలా నాకూ ఎవరేనా ఆడపిల్లతో సరాగాలాడుతూ సరదాగా ఆఫీసుకు వెళ్దామని వుందిగాని మ్చ్!...కుదరదు! ఇంపాసిబుల్! యన్టీకైతే బోల్డు డబ్బిస్తే (నిజమా కాదా? 'రహస్య వీరుని' అడుగుదామా?) బాబూ అన్లా ఏక్టు చెయ్యండి అని కాళ్ళు పట్టుకుని బ్రతిమాలుతారట. ఆ తరవాత నాలాంటి వాళ్లంతా బోల్డు డబ్బు తగలేసి ఆ సినిమాల్ని చూస్తాం. అలానే చెయ్యబోతే 'ఇన్నేళ్లొచ్చి పెళ్లాం బిడ్డలూ సంసారం పెట్టుకుని నీ కిదేం వెధవ పని?' అని తిడతారు...కనుక మన ఆశ, అలా 'మదీయ వూహాపథంబున నిత్యమై సత్యమై వెలుగొందవలసినదే!'

ఔనూ, నిజంకాని ఆశలు కలల్లో ఫలిస్తాయట...నిజమేనా? మరి నిత్యజీవితంలో జరగడానికి వీలులేని చాలా విషయాలూ సినిమాల్లో జరిగినట్టు కనిపిస్తాయి! కనుక సినిమాలూ కలలూ ఒకటేనా? అవునవును! ఒకటే! సినిమాలూ యీక్వల్‌టూ కలలు! ఓహో! 'వాటె ఫైన్ పీస్ ఆఫ్ డిస్కవరీ!' ఈ సిద్ధాంతం మన సొంతమేనా?...మేనా? ఎక్కడో వో సినిమా పోస్టర్‌లో' పంచరంగుల కలలుంటాయా? ఉన్నాయి! 'వాటిని మా సినిమాలో చూడండి' అని చదివిన గుర్తే! ఏ సినిమా అబ్బా అది! 'ఇద్దరమ్మాయిలా?' కావచ్చు! కావచ్చు! అయితే యీ విషయం నాకంటే ముందు వాళ్లే కనిపెట్టినట్టున్నారు! సో! చివరకు తేలిందేమిటయ్యా అంటే టెక్నికలర్ సినిమా యీక్వల్‌టు టెక్నికలర్ సినిమాలాంటి కల! కనుక కలలు కల్లలైనట్టే సినిమాలూ కల్లలే! ఇలలో ఆ యిమిటేషన్ పనికిరాదు! 'సినిమాల ననుకరించబోకు నేస్తం' ... తప్పకోవయ్యా బాబూ! ఓ ప్రక్కకి! అరక్షణం లేటయితే నువ్వూ నేనూకూడా ఆ సిటీ బస్సుక్రిందపడి చచ్చేవాళ్లం!' పాపం అతనూ నాలాంటి భావుకుడేమో! అయినా చస్తే చచ్చేవాణ్ణే, ప్రాణంమీద యింత తీపి యెందుకో! 'అబ్బే! నాకేం తీపి లేదు సార్! వెనకాలవున్న భార్యా బిడ్డలకోసమే, నా బాధంతా! వాళ్ళేం కష్టపడతారో అని భయం కొద్దీ బ్రతకటానికి యీ జాగ్రత్త! 'ఓహో! ఏం చెప్పావ్ మైడియర్ రామరామ!' అదేమిటి! 'రామారావూ' బదులు 'రామరామ' అంటున్నాడు యీ నాలోవాడు! నేను చెప్పిన కారణంలోని అసత్యం గ్రహించి అపహాస్యం చేస్తున్నాడా? ఓ రకంగా చూస్తే యీ పైకి చెప్పేది వొట్టి నాన్‌సెన్స్! చచ్చిన వాడికి బ్రతికివున్నా వాళ్ళ కష్ట సుఖాలు అనవసరం! తన ప్రాణంమీద తనకున్న తీపిని చెప్పకోలేక ఎవళ్ళమీదో తోసేస్తూ వుంటాడు! 'నాకు చావాలని లేదు! నాకోసం నాకు బ్రతకాలని వుంది!' అని ముఖాముఖీ చెప్పే వాళ్ళు ఎంత తక్కువో! పాపం స్వర్గంలోవున్న (స్వర్గంలోనే వుంది అనుకుందాం! నష్టమేం వుంది!) సినిమాతార మధుబాలమాత్రం యీ సంగతిని నిర్మొహమాటంగా చెప్పేసింది! 'నాకు చచ్చిపోవాలని లేదు! నన్నింకో డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళండి' అని! అదీ ఆఖరి క్షణాల్లో! 'బ్రేహో మధుబాలా!' 'ప్యార్‌కియాతో డర్నాక్యా' అని ధైర్యంగా మొగల్—యి—ఆజమ్ 'సినిమాలో పాటపాడటం నీకే చెల్లింది! నిజ జీవిత మందునూ, సినిమాల యందునూ, వొకే విధమైన పాత్రలను నిర్వహించిన మధుబాల ధన్యజీవి! ఇందువల్ల ఆమె కుటుంబమే

కాక భరత వర్షమును, ఆసియా ఖండమును, ధన్యమైనవి! అబ్బ! మళ్లీ యీ చిన్నప్పటి వాక్యాల ధోరణి! 'ఎవ్విధంబువనూ, యీ చిన్నతనము వొదిలించుకొనుట, యీ పెద్దతనంబున నాకు సాధ్యంబు గాకున్నదే!' హతవిధీ! యింకేమి చేతును!.. ......

పోనీలెద్దూ! ఈ సంతోషపు జ్ఞాపకాలైనా లేకపోతే జీవితమే ఛండాలమైపోయేది! పెద్దవాళ్ళమైనప్పటినుండి చేసేవన్నీ ఛండాలపు పనులే! ఇవి అస్తమానం జ్ఞాపకంవస్తే ముందుచెయ్యవలసిన పరమ ఛండాలాలను చెయ్యలేముగా! కనుకనే భగవంతుడు పెద్దవారికి చిన్నతనముమాత్రమే గుర్తుండునట్లు వరమిచ్చెను!

హమ్మ! ఆఫీసు గేటొచ్చేసింది! అబ్బో నా టైము పదీ పదిహేను అయినా ఆఫీసరుగారి కారు ఆఫీసు ముందుండే అప్పుడే! నా గడియారమే తప్పో ఆఫీసరుగారు ముందే వచ్చుట నాకు ముప్పో ఎవరికెరుక? చెమటపట్టు వరకును ఆగి తుడుచుకొనుట శ్రమజీవుల కర్తవ్యము. దాన్ని మెల్లి మెల్లిగా కర్చీఫుతో అద్దుకోవాలి! దానిని చూసి ఓహో నేనింత శ్రమించి దేశము నుద్ధరించుచుంటినికదా అనుకోవాలి! వీలైతే కాపిని కన్నీళ్లుకూడా! ఓహో! ఏం సినిమా టిక్‌గా వుంది! ఇది సరేగాని అసలు ఎండా కొండా అనక పనిచేసే 'ఉప్పరి' సంగతేమిటి? వాడికి వంటిమీద గోచీతప్ప ఏమీ వుండదే! ఇంక కర్చీఫు ఎక్కణ్ణుంచి వస్తుంది తుడుచుకోడానికి! 'ఘర్మధారలు సలిల ప్రవాహంబుల భంగి సాగిపోవు!' వాడి చెమట ధారల్ని వర్ణించి కవులు డబ్బు చేసుకోవడానికి తప్పితే అవి వాడికి యెం కెందుకూ పనికిరావు! లేని చెమటను తుడుచుకొన్నట్లు నటించేందుకు సినిమా తారలకెంత డబ్బిస్తారో! దాన్ని చూడ్డానికి వెళ్ళి మనంయెంత తగలెయ్యం! నిజంగా ఉప్పరి పని చేస్తూంటే చూడమే! వాడి స్థితిలో మనం వుంటేనో అన్న భయంతో ఆరమైలు ముందుకు వెళ్ళేవరకు వెనక్కి తిరిగి చూడం! కనుక మనకు నిజంకంటే నటన అంటేనే ఎక్కువ మోజన్నమాట! నిజాన్ని చూడలేని, భరించలేని, దీనులం! హీనులం! భీరువులం!... సైకిలుకి స్టాండువేసి తాళం వెయ్యడానికే పది నిముషాలైందే! ఆఫీసరు మహా ప్రభువులు ఆఫీసులో కదుగుపెట్టిన మరుక్షణంనుండి క్షణ క్షణం నన్ను పిలవక మానరుగదా! అటువంటప్పుడు యిప్పడి కెన్నిసార్లు పిలిచి వుంటారో! 'హరియప్! రామారావ్! స్కూల్లో వంద గజాల పరుగు పందెంలో ఎన్నిసార్లు ఫస్ట్ రాలేదూ?' 'కమాన్ క్విక్! రమారావ్ కమాన్!' ఎవరివీ మాటలు సుజాతవా? ఎక్కడుందో పాపం వెర్రిపిల్ల! నేనెప్పుడు స్పోర్ట్సులో పాల్గొన్నా ఎంకరేజ్ చేస్తూ వుండేది! నైస్ గర్ల్! పి. యూ. సీ. అయిపోయాక వాళ్ల నాన్నగారి ట్రాన్స్‌ఫర్ మూలాన్ని విశాఖపట్నం వెళ్లిపోయింది. పెద్దపెద్ద (అమాయకత్వాన్ని వెల్లడిచేసే) కళ్లు! దట్టమైన నల్లటి జుట్టు! అచ్చం బాపు బొమ్మలా వుండేది! పరుగు పందెం రోజున నాకోసం అరిచి అరిచి గొంతుక పోగొట్టుకుంది! 'సుజాతా ఎక్కడున్నావ్: ఎక్కడున్నా, నువ్వు నీ భర్తా పిల్లలతో కులాసాగా వుండాలి! మే గాడ్ బ్లెస్ యూ!'...

...'ఓయ్ ఓయ్ వెంకటయ్యా! సంతకం పెట్టకుండానే రిజిష్టరు తీసుకెడతావేం? ఇంకా పదీ వలభై కాలేదుగా! అయ్యగారు పదిన్నరకి ఎంతమంది వచ్చారో చూడ్డానికి తెమ్మన్నారా? సరే తీసుకెళు!' అంటాడు అంటాడు! అనడూ! ఆయన సొమ్మేం పోయింది? ఈయన పదిన్నరకి వచ్చి అయిదు గంటల వరకూ ఎన్నిరోజులు వున్నాడో ఎవరేనా లెక్క అడిగితే బాగుండును! ఊహ! ఎందు కడుగుతారు! వాళ్లూ అలాంటి వాళ్లేగా! 'కంచెయే చేను మేసిన మంచె యేమి చేయును!'

ఓహో! ప్రాసకోసం కాస్త స్వంత కవిత్వం కూడా కలిపినట్టున్నాను! తప్పు కనిపించటంలేదు కాని మంచె బదులు మంచెమీద వాడు అని వుండాలేమో! అలా ఉంటే అప్పుడు 'కంచెయే, మంచెయే' అనే 'యమకంపు సొంపు' దెబ్బ తింటుందే! పోనిద్దూ! ఎవడేనా అడిగితే 'మంచె' అంటే మంచెమీద వాడు

అని అర్థం చేసుకోవాలి అని డబాయిద్దాం! ఎంతమంది పెద్దపెద్ద కవులే అల్లా చెయ్యటంలేదు!...

...'ఓహో! అయ్యగారు రమ్మంటున్నారా వెంకటయ్యా వస్తున్నా వొస్తున్నాను! ఒస్తానాననైప్ప!' వస్తాను సార్! రాక ఛస్తానా! తమ అడుగులకు మడుగులొత్తవలసినవాడిని! తమ పాదారవింద రజాన్ని శిరస్సున ధరించవలసినవాడిని! యువర్స్ మోస్ట్ ఒబీడియంట్లీ!

......'అమ్మయ్య! ఈసారికి అయ్యగారు ప్రసన్నంగానే వున్నారు. దాం తగలెయ్యా! ఆయనగారి ఎదురుగుండా వెళ్ళేసరికి ఆలోచనలన్నీ ఆకాశంలో కెగిరిపోతాయో యేమో! ఒక్కటీ గుర్తుండి చావదు బయటకొచ్చేసరికి! అమ్మ! ఈ పూటకి పిడుగులు, ఉరుముల, కురియింపు లేదు! 'కురియింపు' అన్న ప్రయోగం రైటేనా? అయ్యేవుంటుంది! కాకపోతే యిప్పుడవుతుంది! 'కాదన్న మాదన్న' యెవడు అని మనమూ వో ఛాలెంజి విసిరితే సరి! కాదనబోయే వాడు కూడా నోరుమూసుకు వూరుకొంటాడు. ఎంతమంది ఎన్ని క్రొత్తపదాల్ని తయారించటం లేదు తెలుగులో! ఈ తయారించు అన్న మాటని మూడు వీక్లీల్లో చదవలేదూ!......

'ఓయ్ ఓయ్ రామారావ్! అయ్యగారికి ఫైలు అరగంటలో యివ్వకపోతే నీ బుర్ర రామ్ రామ్!' అబ్బ తిట్టేది సరిగ్గా తిట్టవోయ్ నాలోని మనిషీ! 'నీ బుర్ర రామకీర్తన' అనాలి కాని 'రామ్‌రామ్' అనకూడదు! నీకూ నాకూ మాటలు చెల్లు అన్నప్పుడు మాత్రమే మనవాళ్ళ రామ్‌రామ్ అంటారు. గుర్తు లేకపోతే సరళని గుర్తుతెచ్చుకోరాదూ! సెకండ్ ఫారమ్‌లో రామ్‌రామ్ అన్నాక మళ్ళీ నాతో యింతవరకూ మాట్లాడిందా సరళ, యీ వూళ్ళోనేవున్నా? ఇంతకీ అసలు యీ ఫైలులో యేముంది? కాయితంలో ఏం వుంది? ఆయనగారేదో పని చెబుతున్నా 'దిగిరాను, దిగిరాను, దివినుండి భువికి!' అన్నట్టు మనం వూహాలోకంలోంచి క్రిందకు దిగకపోతే ఆయనేం చెయ్యమన్నాడో మనకేం గుర్తుంటుంది?......

......'సరే! ఏం చేస్తాం! వచ్చిన కాగితాన్ని బట్టే నోట్ పెడదాం!'...అమ్మయ్యా! గుర్తులేనన్ని ఆలోచనలమధ్య మొత్తానికి ఫైలు పూర్తిచేసా!' 'కంగ్రాట్స్ రామూ' ఆయనగారిచ్చిన టైముకన్న పదిహేను నిముషములు ఎక్కువ టైములో మాత్రమే పూర్తిచేసి రికార్డు సృష్టించావు! రికార్డ్! రికార్డ్! రికార్డు! పద్మాదేవీ! ఎక్కడుంటున్నారు మీరు? నేను చేసిన ప్రాక్టికల్స్ అన్నీ నా రికార్డునుంచి చక్కగా ముత్యాల కోవలాంటి అక్షరాల్లో కాపీచేసి, ప్రాక్టికల్స్‌లో నాకంటే ఎక్కువ మార్కులు సంపాదించేవారు! అఫ్‌కోర్స్! మీ సంగతి తెలిసినా ఆ ఏడుపు మొహం లెక్చరర్‌గాడు మీ, నవ్వనే, సమ్మోహనాస్త్రంలోపడి వొళ్ళు మరిచి నోరు మూసుకు ఊరుకునేవాడు! ఇంకా నయం! పద్మాదేవి రికార్డు నేను కాపీ చేస్తున్నానని. నన్నే డబాయించపోయాడు వో సారి! 'డర్టీ స్కాండల్!' దగ్గరనుంచో బెట్టుకుని ప్రాక్టికల్‌చేసి రిజల్టు చూపించాక నోరు మూసుకుపోయాడు! దొంగపీనుగ! ఇంకా ఆ కాలేజీలోనే లెక్చరర్‌గా 'రాట్' అవుతున్నాడు. నా ఖర్మ బాగోపోయి రిజల్ట్ రాకపోతే అబ్బాయిలు అమ్మాయిల ముందర నా పరువేమయి వుండేది! నాదే సత్యము కనుకనే నా పరువు నిలబడినది! సత్యమే దేవుడు! కనుక దేవుడున్నాడని ప్రూఫ్ అయింది! ఓహో ఏం బావుంది రీజనింగ్!' 'తర్కాగ్రేసర, తర్కపంచానన!' ఆగాగు! ఆగవోయ్ రామారావ్! ఆ ఫైలు వెంకటయ్యకిచ్చి, ఆపయిన, టైటిల్స్ యిచ్చుకో!

......'వెంకటయ్య! ఆఫీసరు వెనకటి అయ్యా! ఈ ఫైలు లోపలికి తీసుకెళ్ళు!' పాపం మంచి ముండావాడు. వాడికి రావలసింది వాడికి ముడితే, ఎవడిమీదా చాడీలు చెప్పడు! లేదో గోవిందో గోవింద! 'అయ్యయ్యో! అలా అరుస్తా వెందుకయ్యా!' ఆఫీసరు తి ప్టేడా! నన్ను పిలుచుకు రమ్మన్నాడా!' బాబోయ్! కొంప మునిగిందిరా దేవుడా! ఆపద మ్రొక్కులవాడా అలిమేలు మంగా పతీ! ఆర్తత్రాణ పరాయణా! నువ్వే నాకు దిక్కు! 'ఒస్తున్నానయ్య...పద!'

......'అమ్మయ్య! లోపలికికెళ్లి బయటకొచ్చే సరికి తుఫానులోంచి బయట పడ్డట్టైంది! కాగి తంలో తాసిల్దారు రికమెండ్ చేసిన ప్రకారం ఆ పోరం బోకు భూమి రంగయ్యకు యివ్వడానికి నోటు పెట్టాను!ఆయనగారు వాడికి యివ్వకుండా రమణయ్యకి యిచ్చేలా పాయింట్లు 'లాగి' నోటు పుటప్ చెయ్యమన్నా డట! ఆయన చెప్పింది మనం తిన్నగా వినిపించు కోలేదు కదా! చిత్తము పరాయత్తమైనప్పుడు యిటు వంటి విపత్తులే సంభవించును! ఇంకో పది నిము షాల్లో అలా నోటు రాసి యివ్వకపోతే కలెక్టరేట్ నుండి తాలూకా ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ తప్పదుట.

......'మై గాడ్!' ఎల్లాగో వోలాగ ఆయన చెప్పినట్టు నోటు పెట్టేద్దాం! ఆ తాసిల్దార్లు నమిలి మింగేస్తారట, క్లర్కుల్ని! అయినా నోటు మార్చటం ఎంతసేపు? ప్రతీ రూలుకూ వెనకా ముందూ ఉంటా యిగా! అందులో ప్రస్తుత ప్రభుత్వంవారి రూల్సు మరీ ప్రత్యేకమైనవి! అన్వయించేవాడి చాతుర్యాన్ని బట్టి అర్థాలు మారుతూ వుంటాయి! వడ్డించేవాడు మనవాడన్నట్టు, ఆయనే మార్చమంటే నాకేం! రెండు నిముషాల్లో మార్చిపారెయ్యనూ! క్విక్, క్విక్, రామారావ్! 'టేకిట్ ఆఫ్!' ఒద్దొద్దులే! డ్రాయరు సొరుగులో పడెయ్యి! ఎందుకేనా మంచిది! 'క్షణ క్షణముల్ ఆఫీసర్ల చిత్తముల్!'

...'పూర్ రంగయ్యా! మై కండూలెన్సెస్...

'ఏం వెంకటయ్యా అప్పుడే వచ్చావు అయ్యగారు రమ్మం టున్నారా?...ఏమిటి? ఏవన్నావ్! ఓహోహో! అయ్య గారు ఫోనొచ్చి యింటి కెళ్లారా? ఫైలు తీసుకుని అరగంటలో నన్నింటికి రమ్మన్నారా!......'థాంక్యూ రంగయ్యా థాంక్యూ!' అమ్మయ్య! మనం మళ్లీ యింకో పది నిముషాలు గాలి ప్లన్ వూహలు మెయ్యొచ్చు! అయ్యగారికి నేను లోకువ! అయ్యగారు అమ్మగారికి లోకువ! కనుక మనం అమ్మగారికీ లోకువే! 'అమ్మగారికీ' ఏనిటోయ్ వెర్రి రామారావ్! నీకు తప్ప నువ్వందరకీ లోకువే! ప్రతి వాళ్లు నిన్ను శిక్షించుటకు, భక్షించుటకు ప్రయత్నిస్తారు!

వరండాలో ఎవడా దీనుడు? చినిగీ చిను గని వస్త్రాలతో, చెమటచే తడిసీ తడియని కండువాతో ఏమూ వాలకం! 'ఓ యూ దీనుడా! నీవు, 'మేము నీ కంటే అధికులమని ఆత్మ సంతృప్తి కలిగించుటకు యేతెంచిన దేవుడవా?...'వెంకటయ్యతో ఏదో మాట్లాడుతున్నాడే వాడు! వాడి చేతిలో వో రూపాయికూడా పెడుతున్నాడు! ఇదేమిటి! నా దగ్గిరకే వస్తున్నాడే!...

.....'అవునయ్యా! నేనే రామారావును! ఏం కావాలి?' హతవిధీ! ఏ రంగయ్యకైతే యింతకుముందు మనసులో కండొలెన్సెస్ చెప్పుకున్నానో ఆ రంగయ్యేట యితను! తన పేర ఆ పోరంబోకు భూమి దఖలు పడేలాచూస్తే ఏదో తోచింది యిచ్చుకుంటాట్ట. 'పూర్ ఫెలో!' ఆ చినిగిన గుడ్డలు తప్పితే యేమున్నాయ్ వాడి దగ్గర యిచ్చుకోడానికి! వాడి కథ వినీ యింకా మూర్ఛపోకుండా ఎలావున్నా నబ్బా? వీడికే భూమి యిచ్చేలా నోట్ పెడితే ఏం చేస్తాడు ఆఫీసరు? 'నన్ను ట్రాన్స్‌ఫర్ చెయ్యొచ్చు! రమణయ్యకి ఫర్గా వేరేవాడిచేత రాయించొచ్చు!' అలాచేస్తే చెయ్యనీ నా ఆత్మ సంతృప్తేనా మిగులుతుంది! ఆత్మసంతృప్తి చాలదూ ఎవరు సంతోషించకపోయినా? ఔనౌను! అదే రైటు! 'రంగయ్యా! ఎవరు నీకు న్యాయం కలి గించినా, కలిగించకపోయినా, నేను మటుక్కి నీకు న్యాయమే చేస్తాను! వెళ్లిరా! వెళ్ళు!...'హో! వెళ్లి పోయాడు, మెల్లిగా జాలి కలిగించేలా!...ఇతనికి న్యాయం కలిగించకమానను. 'హరిహర బ్రహ్మాదు లడ్డము వచ్చినమ రానీ!' అద్గదీ! బ్రేహో రామారావ్! మువ్విన్నాళ్ళకి మంచి మనిషిగా, మానవతా ప్రతినిధిగా మారావు! కమాన్ డ్రాయరులో కాగితం పైకితీసి, ఫైలు చంకన పెట్టుకెళ్లి ఆఫీసరును ధైర్యంగా ఎదుర్కో! ఎన్ని సినిమాల్లో హీరోలు. విలన్లు తిడు తున్నా కొడుతున్నా అరగంట లెక్చర్లివ్వటం చూడ లేదు! స్టార్ట్! సైకిలును రథంలా తోలుకుపో! నిరస్త్రీ భూషితుడవై ఆఫీసరు రాక్షసి నెదుర్కో! 'కారేజిపై ఫైలుకట్టి వడివడిగా సైకిల్తుత్రొక్కి...'

వెదవది ప్రతిపనికి సినిమాలోలా తోడుగా పాటవుంటేనే కాని కుదరదేమో! నా స్వంత పాటల్తో మరీ బోరుకొడుతోంది. అయినా మానడు లోపలి కవి గాడు! దుర్విధీ నాకీ పాటల పీడ తప్పదా! త్రొక్కు, త్రొక్కు! త్రొక్కవయ్యా బాబు సైకిలును తొందరగా!

......అమ్మమ్మయ్యా! అయ్యగారి బంగళా వొచ్చేసింది. వొచ్చేసిం దొచ్చేసింది! మెల్లిమెల్లిగా, అల్లనల్లన, దీనుడిలా హీనుడిలా, చెప్పుక్రింద తేలులా, కాలిక్రింద నల్లిలా వెడదాం, వెడదాం, లోపలి కెడదాం! ఛఛ! ఇదేం ఉపమానం దెబ్బలాట కెడుతూ! భద్రా చలం పెద్దపులిలా, కోస్తాలో తుఫానులా, విరుచుకు పడవాం! ఆఫీసరు నెదిరిదాం! అద్దదీ! అలా వుండాలి! నాలోపలి తెలుగు కవిగాడికి మతిపోతోంది. మరుపు పెరుగుతోంది. ఎంతసేపూ జాలి కవిత్వం, ప్రేమ కవిత్వం తప్ప విప్లవ కవిత్వం అంటే చచ్చే భయం! నోరు పెగలదు! పాపం వాడినని ఏం ప్రయోజనం! ఆంధ్రదేశమే అలా అ రిస్తోంది! వాడు మాత్రం నలుగురుతో వాడు కాదూ!

## భాగం 4

...అబ్బో! ఇంద్ర భవనమే యిది! ఎన్నిసార్లు చూసినా క్రొత్తగానే వుంటుంది. అయ్యగారు క్రొత్త గాని, మనకి బంగళా పాతదే కదా! అయినా ప్రతిసారి క్రొత్తగానే వుంటుంది! ఇంద్ర భవనమున దేవతలు వసింతురు కదా! కదా ఏమిటి! అయ్యగారు దేవుడు! అమ్మగారు దేవత! పిల్లలు బుల్లిదేవతలు! నేను! నేను మాత్రం నరుణ్ణి! నరాధముణ్ణి! అధమాధమ నరాధముణ్ణి! ... 'ఛ! వచ్చిన పని మరిచిపోతున్నా!' ఈ రాక్షస దేవత నెదుర్కొని, అదేమిటి? రాక్షస దేవత? సరిక్రొత్త పదాన్ని సృష్టించినట్టున్నానే! ఇంద్ర భవనంలో ఉండేవాళ్ళు దేవతలు. కాని మాఆఫీసరు ఇంద్రభవనమున నివసించుచునూ మానవుల పీడించ నెంచుచున్నాడు! కనుక రాక్షసుడు! సో! నా క్రొత్తపదమేరైటు 'రాక్షస దేవత'! లేక దేవతా రాక్షసు డైన, అవునవును అంతే! వ్యవసాయశాఖవారి సంకరజాతి విత్తనాలలాగే ఇదీ వో సంకరజాతి! కనక 'ఓరీ రాక్షస దేవతా! ఇదే వే యేతెంచుచుంటిని! కాచుకొనుము! మదీయ 'నోట్'తో నీ ఆశల కూల్చద్రోసి, నీ రవు ణయ్య కేసు నగ్గి పాల్గావించి, రంగయ్యకే భూమి నిప్పించెదను!'......

'సుబ్బన్నా! అయ్యగారెక్కడున్నారు? డ్రాయింగ్ రూములోనా, ఆఫీసు రూములోనా? మంచి మూడ్‌లో వుంటే చెబుతావ్!' ఛ! వెధవ అలవాటూ నేనూను! దెబ్బలాడటానికి వెళ్తూ, ఆయన మంచి మూడ్‌లో వుండట మెందుకో!...' ఏమిటి? ఇంట్లో లేరూ? మరి నన్ను రమ్మన్నారే ఫైలు తీసుకుని! ఆఫీసుకే రమ్మన్నారా?...లేదూ?...పోనీలే అక్కడికే వెడతా!... ఆఫీసుకే వస్తారేమో ఆయన! ఒద్దయ్యా మొగడా! నే చెప్పేది విను! ..నే వొచ్చానని అమ్మగారికి చెప్పకు! ఒద్దయ్యా వాయనా!'

...అబ్బబ్బ! వెఱ్రి ముండాకొడుకు! నా ప్రాణం తీస్తేనే కాని వదలడులావుంది! వెళ్లిపోయాడు!... ఇప్పుడా అమ్మగారు సవా లక్ష ప్రశ్నల్తో నా ప్రాణం తీస్తుంది. నన్నో పురుగులా చూస్తుంది! తన భర్త పుట్టడమే ఆఫీసరుగా పుట్టినట్టూ, తాను చిన్నప్పటి నుంచీ ఆఫీసరు పెళ్లాంగానే బ్రతికినట్టూ నటి స్తూంది!...ఎలాగెలాగ ఆ చూపు భరించడం?...... ఏం దారేం దారి; నాకేది దారి? 'క్రూర విధీ! నా పరి స్థితి చూసి అపహసించుచుంటివా? అపహసించు, మపహసించుము! నే నిప్పు డెదుర్కొనబోవు దుర్భర పరిస్థితికంటె నీ అపహాస మధికము కాబోదు! హు! పోనిద్దూ! 'కానున్నది కాకమానదు!' 'నీతి చంద్రికలో చదువుకోలా? .....'లేకపోతే యేహో పెద్ద చెయ్యి గలిగిన వాడిలా వెధవ స్టైలూ నేనూను!' చింత చచ్చినా పులుపు చావ దన్నది యిప్పుడు కదా ప్రూవ్ అయింది! నేటికికదా అనుభవంలో కొచ్చింది! ఒచ్చేస్తోంది అమ్మగా రొచ్చేస్తోంది! తుఫానులా కాళికాదేవిలా, విరుచుకు పడుతోంది! శూర్పణఖ చెల్లెల్లా వచ్చేస్తోంది! కళ్లు మూసుకుని, మెల్లి మెల్లిగా తెఱిచి, అపాయాన్నెదుర్కొందాం!

...ఏమిటి! 'ఎవరు? నువ్వా రామారావ్!' అని పలకరిస్తోందేమిటి యీవిడ! మతిపోలేదుగదా ఈవిడకి. లేకపోతే సుబ్బన్నగాడు నా పేరు చెబితే వేళాకోళం చేస్తోందా! కాదు కాదు! యీవిడ, యీ విడ యీవిడ కందుకూరి అరుణకాదూ! అవునవును! నా కాలేజి మేట్ అరుణే! ఆమే! అదుగో ఆ పెద్ద కళ్లు, గుండ్రని మొహం చక్కటి ముక్కు! ఆమె ఆవిడ, యీవిడే! పలకరించనా? 'నువ్వా అరుణా! అనవచ్చా?...' తప్పు తప్పురోయ్ రామారావ్! ఆవిడ నీ ఆఫీసరుగారి భార్య!...'మీరు...మీరు ..' నా తడ బాటునుచూసి నవ్వుతోంది! ఇప్పటికీ మారని అదే నవ్వు! 'ఛ! ఇప్పటికీ మారని వెధవ కంగారు నేననాను!' వెర్రి వెధవలా నిలబడ్డట్టున్నాను!...

'ఆయ్! ఆయ్! ..నేను తమరి క్లాస్‌మేట్ రామారావు నేనండి! ఇక్కడ యు డి. పి గా అయ్య గారి అఫీసులో పనిచేస్తున్నా! అబ్బే వద్దండి! కూల్ డ్రింకువద్దు! నాకు అలవాటు లేదండి. ఒక్క మంచి నీళ్లు చాలండి!'......

......అబ్బో! అరుణ ఏమీ మరిచి పోలేదే! కాలేజీలో వేసంకాలం కూల్‌డ్రింక్సుతప్ప ఏం త్రాగే వాడివి కాదుకదా అంటోంది! ఆడవాళ్ళకు, వాళ్ల స్నేహితుల్ని గురించి యెంత గుర్తో! అందరికీ యిలాగే వుంటుందా? ఉండదేమో! కాని అరుణ! అరుణ వేరు! అరుణకు ఎందుకో ముందునుంచీ నేనంటే యిష్టం! ఎప్పుడూ కాలేజీలో వున్న న్నాళ్లూ ప్రతివిషయానికీ నన్ను ఎంకరేజ్ చేసేది, 'ప్రేమలో' తప్ప! అయినా ఆమెను చూస్తూంటే, ఆమె చుట్టుపట్ల వుంటేనే లవ్వూ, గివ్వూ లాంటి అభిప్రాయాలే వచ్చేవి కావు! తన కూడా, ఆడ స్నేహితులున్నా, నేను నడిచొస్తూ దారిలో కనిపిస్తే, కారెక్కించుకుని, కాలేజీకి తీసుకు వెళ్లేది! అఫ్ కోర్స్! ఆ రోజుల్లో నేనూ వో ఆడపిల్ల లాగే మసిలేవాణ్ణిగా ఆమె దగ్గర! 'నోవమాన్లీ యిన్ స్టింక్స్ యిన్ మి'! చదువులో ఫైనార్ట్సులో అన్నింటిలో నన్ను ప్రోత్సహించిన దేవతామూర్తి! అరుణా! నీ సాహచర్యం మరువలేని ఒక చక్కటి కల! అవునూ యీవిడ కాలేజీ చదవగానే వాళ్ల నాన్నగారితో 'స్టేట్స్‌కి' వెళ్లింది కాదూ! మళ్లీ యిప్పుడు యిక్కడ! 'అరుణా! ఎన్ని రోజులు విన్నా నీ సాహచర్యాన్ని గుర్తుకు తెచ్చుకుని బాధపడే వాణ్నో తెలుసా!' 'బాధా' అవును బాధే! ఆప్యాయతా పూర్వక ఆకర్షణవల్ల కలిగిన బాధ! 'దేవుడా! నువ్వు నిజంగా దేవుడివే అయితే ఒక్కసారి అరుణని నా కళ్లపడెయ్యి' అని ప్రార్థించానే! ఇవన్నీ ఆమెకు చెప్పాలని ఉరకలు, పెడుతోంది మనస్సు! కాని అవి బయటపెడితే చుర కలు తగలొచ్చు!' 'మై డియర్ మట్టి బుర్ర రామా రావ్! ఇప్పుడామె నీ ఆఫీసరుగారి భార్య! పదేళ్లనాటి పాత పరిచయాన్ని గుర్తుకు తెచ్చుకో ప్రయత్నించావో జాగ్రత్త! ఆవిడా ఆయన నిన్ను శంకర్‌గిరి మన్యాలు పట్టించొచ్చు!......

'ఆయ్! ఆయ్! ఈ వూళ్ళోనే వుంటున్నా నండి! పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు! శ్రీమతి పేరు శారదామణి! మా యింటికి వస్తామంటారా? తప్ప కుండారండి! అంతకంటేనా! మీరొస్తే మా యిల్లు పావనంగాదూ! ..అలాగేనండి! కూర్చుంటున్నా!... కూర్చుంటున్నా' 'ఎన్నాళ్లకి ఆఫీసరుగారింటి సోఫాలో కూచో గలిగానో!' అది సరేకాని, అమ్మ బాబోయ్! ఇప్పుడీవిడవస్తే మా యింట్లో యీవిణ్ణి సత్క రించటానికి తగిన సాధనాలుకూడా లేవే! అయినా మా యింటి కెందుకు?...వస్నా నా సంసారాన్ని చూసి గేలిచేయడానికా? 'ఛ! అయుండదు!' మరీ మానవత్వంమీద విశ్వాసం సన్నగిల్లిపోతోంది నాకు! అరుణ కళ్లల్లో కాలేజి రోజులనాటి స్నేహ భావం కనిపిస్తూనే వుందికదా! 'అరుణా! అరుణా! కాలేజి రోజుల్నించీ నా మనసులోవున్న నీ పవిత్ర స్వరూ పాన్ని యిప్పుడు మార్చకేం! నువ్వు నా స్నేహితురాలిగా, నా 'గైడ్'గా ఆరాధ్యమూర్తిగా, చక్కటి కలలకు ప్రతిరూపంలా నిలిచావు! అల్లాగేవుండు అరుణా! నువ్వు మారకు! నువ్వు మారితే నేనా 'షాక్' తట్టు కోలేను! అరుణా! అరుణా!......

'ఆ! ఆ! అహహ! లేదు! మీ పేరు గుర్తుకు తెచ్చుకుంటున్నా! మెల్లిగా నోట్లో అనుకుంటున్నాను మీరు గుర్తులేకేం! చక్కగా గుర్తున్నారు! నా కాలేజి జీవితానికి 'సిల్వర్ లైనింగ్' మీరేకదా! (బాబోయ్! ఇలా అన్నానేమిటి? కోప్పడదుకదా యీవిడ!) అమ్మగారొస్తున్నారంటే ఎంత భయపడ్డానో!'......

......'నన్ను చూసి భయంలేదా?' అని నవ్వుతోందేం యీవిడ! నవ్వుతూనే, నన్నుచూసీ భయపడాలి సుమా' అని హెచ్చరించటం లేదుకదా యీవిడ?' అయ్యుండదు! అయినా ఆడవాళ్ల నెవడు నమ్మమన్నాడు. 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్' పద్యం గుర్తులేదూ! ఈవిడా మారి వుండొచ్చు! అయినా పది సంవత్సరాల క్రిందటి పాత పరిచయాన్ని పట్టుకు ప్రాకులాడే వాడిని చూస్తే ఎవరికేనా నవ్వొస్తుంది!...తప్పదు! తప్పదు!...'నా సీనియారిటియాండీ! చచ్చినంత వుంది! రెండుసార్లు డిప్యూటీ తాశీల్దారు యిచ్చి వుండొచ్చు యీ పాటికి! నా సంగతి మీకు తెలుసుగా తల్లీ దండ్రీతప్ప ఎవరూ లేనివాణ్ణి! నా కెవరు రికమెండ్ చేస్తారు? రికమెండేషన్‌లేనిదే ప్రమోష నెవరిస్తారు!'

...'ఏమిటీ! నిజంగానే రెవిన్యూ బోర్డులో వాళ్ళకి, వాళ్ళ నాన్నగారిచేత రికమెండ్ చేయించి ప్రమోష నిప్పిస్తుందా!' 'అరుణా! నిజంగానా! నిజంగా నేనే అరుణా? అప్పటినుండి యిప్పటివరకూ మారనే లేదా నువ్వు! 'అరు...అరు.. అరుణాదేవీ! నీకు నా కృతజ్ఞత ఎలా చెప్పుకోను! 'ఎందుకు యింత ఆప్యాయత నేనంటే నీకు, అరుణా దేవీ?'...అరుణా! అందుకో నా మూగ నమస్సులు

'ఆయ్! అలాగేనండి! నా ఉద్యోగపు 'డిటెయిల్స్' తరువాత యిస్తాను!' థాంక్యూ వెరీమచ్! అయ్యగారు అదే ఆఫీసరుగారు క్రొత్తగా వచ్చారని తెలుసుకాని, మీరు వారి శ్రీమతి అని తెలీదు!... నన్ను ఆఫీసుకు రమ్మన్నారా, ఆయన? ఆఫీసుకే వెడుతున్నానండి! మళ్లి కలుస్తా మిమ్మల్ని! ఇవాళ నాకు చాలా సంతోషంగా వుంది మిమ్మల్ని చూసినందుకు!...వచ్చే ఆదివారం మా శ్రీమతిని పిల్లల్ని తీసుకొస్తా! వస్తానండి! వెళ్ళొస్తా'.....!

...ఏమిటి, ఏమిటి యీ వింత! ఎక్కడి కె. అరుణాదేవి ఎక్కడి నా రాక్షసుడు! హాలాహలము అమృతము. ఛ! ఆయన హాలాహలంకాదు! రాక్షసుడూ కాదు! నేనే మతిమరపుకొద్దీ ఆయన చెప్పినది చెప్పినట్టు చెయ్యను!...ఇదేమిటి సైకిలు టైర్లలో గాలిపోయిందే! వెధవది, వెధవగాలి పోతేనేం!' 'నేనే గాలిలో తేలుతున్నప్పుడు యింక గాలి నా కేల!' గాలిలోన తేలిపోయే...' ఏదో పాట వుండాలి గుర్తొచ్చి చావటం లేదు!...అవునవును. అరుణ! అరుణ! ఇన్నాళ్లకి మళ్లీ అప్పటికన్నా అందంగా అప్పటికన్నా ఆప్యాయంగా మాట్లాడుతూ! 'అరుణా!' అబ్బ! క్రింద చూసుకోకుండా రాతిని తన్నా! గోరు చిట్లింది! వెధవది! ఒక్కగోరే యేమిటి, ప్రాణంపోయినా ఫరవా లేదు! ప్రాణ సమానంగా దాచుకున్న అరుణమూర్తి మనఃఫలకంమీదినుండి ప్రాణం పోసుకుని బయటపడి కళ్ళఎదురుగా ప్రత్యక్షం అయ్యాక, నేనే మైతేనేం!

......'తప్పుకో నాయనా! తప్పుకో! నీ సినిమా ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఏడ్చినట్టే వుంది!' ఛ ఇంక యేదీ యేడ్చినట్టుంది అనకూడదు! ప్రతీదీ అరుణలా నవ్వుతూనే వుండాలి!' అరుణా!' నీతో వున్న వారందరినీ, ప్రత్యేకంగా నన్ను వుత్సాహపరిచే పవిత్రమూర్తివి నువ్వు! నీ సమక్షంలో కొచ్చాక ఏడుపులూ దుఃఖాలూ వుండవు! ఉండకూడదు! అమ్మయ్య! మూడొంతుల దూరం లాగేశా! ఇంకొంచెం దూరం...! ఒచ్చేసా వొచ్చేసా! ఆఫీసుకు వచ్చేసా! 'ఓయ్ వెంకటయ్యా! ఆఫీసరు గారొచ్చారా? రాలేదూ మరీ మంచిది! సరేగాని యీ సైకిలు కాస్తగాలి కొట్టించుకురా! ఆగాగు! ఫైలు తీసుకోనీ!'...ఇంక యీ ఫైలు మిగిలింది! దీంతో ఆఫీసరుతో పోట్లాట వేసుకుందామనుకున్నానే! ఎల్లాగెల్లాగ ఇప్పుడెల్లాగ! అతను అహకాదు! ఆయన అరుణ భర్త! అరుణ భర్త' కనక అతన్ని నొప్పించకూడదు! 'మరి పాపం ! ఆ

రంగయ్యో!' 'ష్! 'ఊరుకోవయ్యా లోలోపి మనిషీ! కాసేపు ఆ రంగయ్యని నువ్వు మరిచిపో! నన్నూ మరిచిపోనీ! ఇలా పోట్లాట వేసుకున్నానన్న సంగతి ఆఫీసరు అరుణతో చెబితే ఆమె ఎంత బాధపడు తుంది? పైగా నాకు ప్రమోషన్‌కి రికమెండ్ చేయిస్తానంది! డిప్యూటీ తాశీల్దార్ అయితే మహా హాయిగా వుంటుంది. డిప్యూటీ తాశీల్దార్ రామారావ్ బి. యస్. సీ...బ్రహ్మాండం! 'ఏం చేస్తున్నావ్ రామా రావ్?...' 'డిప్యూటీ తశీల్దార్‌నండి!' 'డిప్యూటీ తాశీల్దారుగారా! రండి! రండి! ఇక్కడ కూర్చోండి! ఇక్కడ సీటు రిజర్వు చేసివుంది!'.. ఓహో ఏం మర్యా దలు జరుగుతాయి! జీతంకూడా పెరుగుతుంది!... పెరుగుతుంది! రుగుతుంది! పెరుగు పెరుగు అవును! అప్పుడింకా యెక్కువ పెరుగుకొనచ్చు!......

..శ్రీమతి మణీ రామారావ్ డిప్యూటీ తాశీ ల్దారుగారి భార్య! తాశీల్దారుగా రబ్బాయిలు! ఓహో ఏం బావుందేం బావుంది!......'కనక మనం యీ రంగయ్యగాడి గురించి ఆ అఫీసరుగారితో పోట్లాడ కూడదు!' నేను కాకపోతే మరో మనిషి ఎల్లాగూ చేసేదానికి నా భవిష్యత్తును పాడు చేసుకోవడం దేనికి? 'కమాన్ రామం! కమప్ అండ్ డిసైడ్!' 'క్విక్! 'అరుణా విన్ను నే, నొప్పించలేను!'...రంగయ్యా నీ తరఫున వకాలతు పుచ్చుకోలేను! 'క్షమించు మంచి రంగయ్యా! నన్ను క్షమించు!'......

...'కమాన్ రామం! కళ్లు మూసుకుని రాసిన కాగితం చించెయ్యి!' 'రమణయ్యగారికి పొలము దఖలు పరుచుటలో ఏవిధమైన అభ్యంతరమును లేదు!' రాసెయ్యి! రాసేయి తొందరగా! రండి ఆఫీసరుగారూ రండి! మీరు చెప్పినటు తు. చ. తప్పకుండా రాస్తాను! మీరు చెప్పినట్టే రాస్తున్నాను సార్! పచ్చి నిజం! 'నన్ను నమ్మండి!'... ..

...'వెంకటయ్యా! ఆఫీసరుగారు రాగానే చెప్ప నాకు! ఈ లోపల వో కప్పు కాఫీ తెచ్చిపెట్టు!' ఈ రోజుకు నాకు భోజనప్రాప్తి లేదు! లంచ్ టైమ్ పూర్తయి గంటన్నరయింది! 'అభోజనం వున్న అభాజనుణ్ణి!' ఓహో ఆకలిమీద, ఏం చక్కని కవిత్వం వెలువడుతోంది! ఎవడా మూల నీళ్లు నిండిన కళ్లు తుడుచుకొంటున్నాడు? 'రంగయ్యా?' అవును రంగయ్యే! కాని అతని కన్నీళ్లని నేను పోగొట్టలేనే! భగ.. భగ...'భగవంతుడు చెయ్యాలా పని!' నేను నిమిత్తమాత్రుణ్ణి మాత్రమే! అయినా నేనొక్కణ్ణీ లోకం బాగు చేద్దామనుకోవడం వెర్రి కాదూ! అందు లోనూ, అది నా మూలాన్ని ఆగనప్పుడు!...ఏం చెయ్య గలను? నేనూ కాసిని కన్నీళ్లు విడుస్తాను రంగయ్య కోసం!... ..'అరుణా! అరుణ!' ఎంత చల్లనిమాట చెప్పావ్! డిప్యూటీ తాశీల్దార్ పదవి నాకే? నాకే! నాకేలే!.. హబ్బ! కప్పు కాఫీ ఏం వుషారు కలిగిస్తోంది! వుషారా, హోషారా?

...'అల్లాగేలే! వెంకటయ్యా! నేనే అయ్యగారి దగ్గరకు వెళ్తున్నాను'...హమ్మమ్మ! లోపలికెళ్లి రావడం సుడిగుండంలో దూకి బయటపడ్డట్టే! ఎప్ప టికీ ఎప్పటికీ, లోపలకెళ్లి బయటకు వచ్చేవరకూ, ఆలోచన తోచదుకదా! ఆలోచిస్తూనే, ఆలోచనలు గుర్తులేక పోవడం ఎంత దురదృష్టం! అహా! అదృ ష్టమేనేమో! పోనిద్దూ ఏదయితేనేం! 'ఎంత మంచి వాడు ఆఫీసరుగారు!' ఎంత పొగిడాడు నన్ను! తను చెప్పింది చేసానని ఏనుగెక్కినంత సంబరపడ్డాడు! ప్రమోషన్‌కి రికమెండ్ చేస్తున్నానన్నాడు! అరుణ తన క్లాస్‌మేట్‌నని ఫోన్ చేసిందట! అరుణంటే అతనికి ఎంత ప్రేమో! కనకనే అరుణ యిష్టపడిన నన్ను తనూ ఆదరించాడు. ఇన్నాళ్లూ ఆయనలో మంచితనం ఎందుకు కనబడలేదబ్బా నాకు?

...'ఓరీ రామారా వాధమా! నీ సంతోషము నకై రంగయ్య జీవితమును బలిపెడితివే!' ఎవడు వాడు? నీతిశాస్త్రంగాడు కాబోలు! కరవబోయినట్టు మీద పడుతున్నాడు!' ఏడిశావు లేవోయ్ బోడీ! ముందే చెప్పానా, యిది 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్సని'! చిన్న చేపని పెద్దచేప, పెద్దచేపని, యింకా పెద్దచేప, వాటిని మనుషులు మింగుతూనే వుంటారు! కనుక నా ఉజ్జ్వల భవిష్యత్తునకై, ఒక చిన్న, అతిచిన్న,

మానవునికి కాస్త హాని కలిగించిన తప్పు లేదు! అది యునుంగాక 'క్రొత్తవారి వేషభాషలం జూచి మోస పోరాదు!' చదువుకొవలేదా నీతిచంద్రికలో చిన్నప్పుడు? రంగయ్య వేషం మాటలూ అలా వున్నా, వాడు వొట్టి దొంగవెధవే కావచ్చు! నా జాలి సంపాదించడానికి యీ వేషంవేసి వుండవచ్చు!...'ఔనౌనౌను!' అంతే అంతే! ఈ పొలం పట్టుకుపోయి అమ్ముకుంటాడు! సారా త్రాగుతాడు! డబ్బును ముండలకి తగలేస్తాడు! మళ్లీ యిదే వేషంలో తయారవుతాడు! కనుక ముందునుంచీ యిదే వేషంలోనే వుండనీ! ఎవరికీ నష్టంలేదు! ఇంక వాగకు నీతిమిత్రమా! నా కాలేజీ రోజుల్ని కాస్సేపు 'లీజరు'గా తల్చుకోనీ! 'అరుణా!' అయ్యో! పై కంటు న్నానా? నా కొలీగ్స్‌కి తెలిస్తే నా ప్రాణం తీస్తారు, వాళ్ల పనుబు చేయించి పెట్టమని!

...అమ్మయ్య! అమ్మమ్మయ్య! అయ్యయ్యమ్మ! మెల్లిగా అయిదు గంటలు దాటింది. యీ రోజుకు దుకాణం. మూసేద్దాం!...' అయ్యో! 'ఆ రంగయ్య నా దగ్గరకే వస్తున్నాడే!...' నీకు 'ఫర్'గానే నోటు పెట్టాను, రంగయ్యా! ఆర్డర్లు తొందరలోనే వచ్చెయ్యొచ్చు! నీ వూరి కెళ్ళిపో!... 'అమ్మ! వెళ్లి పోయాడు.' కాని నా లోపల యేదో రగడ జరుగు తోందే! 'రాస్కెల్! అబద్ధం ఎందుకు, నిజం చెప్ప లేక పోయావా? అంటున్నాడా నీతిగాడు! 'ఓయ్ నీతి! నీమతి మండినట్టేవుంది! ఎల్లాగూ వాడికి ఆర్డర్స్ రాని దానికి, వాడి ఆశాలతను యిప్పటినుండీ త్రుంచట మెందుకు? ఇంటికివెళ్లిన కొన్ని రోజులకి యీ 'అశుభ'వార్తని తెలియనియ్యి! ఈ సంగతి యిప్పుడి చెప్పి అతని సంతోషాన్ని పాడుచేసే హక్కు నాకు లేదు!'...ఎందుకు వికటంగా నవ్వుతావు నీతీ? ఏవుందోయ్ వెటకారానికి?...గిల్లి, బాధపడుతున్నాడని కొబ్బరినూనె రాయడంలా వుందా? 'ఏడిశావ్!' నీలై వంతలో నీ తోటి మానవుడికి సుఖం కలిగించమని గాంధీగారితోసహా బోల్డుమంది చెప్పడం చదువు కోలేదూ? 'నేను నా విధిని నిర్వర్తించినందులకే గేలిచేయుచుంటివికదా!' 'ఓ నీతీ! నువ్విలా అడ్డ మైన దానికీ అడ్డంపడి నవ్వుతూంటేనే కలిపురు షుడు నిన్నీకాలంలో వొంటి కాలిపై బ్రతకమని శాసించాడు' నోరు మూసుకుని ఉన్నావో సరేసరి! లేకపోతే ఆ వొక్క కాలూ, కూడా వూడుతుంది! కాళ్ళు విరిగిన, కీళ్లు సడలిన నువ్వేమవుతావో నీకే తెలీసు కనుక నోరు మూసుకుని ఊరుకో!'...ఓహో! కవిత్వం ఉప్పొంగుతోందేమిటి, నాలోంచి! 'డి॥ తా॥ రామారావు, డి॥ తా॥ రామారావు! తాడి చెట్టె క్కాడు రామారావు! డి॥ తా॥ వదవనే తాడి వధిరో హించిన వీరాధివీరుడు రామారావు!' 'ఇంకా ప్రమో షన్ వచ్చి చావలేదు అప్పుడే పద్యాలు!', ఇంకేమీ పనిలేదీ కవిగాళ్లకి! జరగబోయేవాటికి, జరిగినవాటికి అన్ని విషయాలకీ పద్యాలు! ఏదేనా వొక విషయం జరగటం చాలు వీళ్ల 'కవితోద్భవం' జరగటానికి!... అబ్బ! ఎంత పెద్దమాట వాడాను! పద్యాలు, పదాలు... పదాలతో పద్యాలు! ఎవడి పాదాలో పట్టుకొంటూ, పదాలతో పద్యాలు! ష్! చాలు! చాలింక నీ కవితా పాటవం! అసలూ ఎవరూ గద్యాలు రాయరేం పద్యాలు తప్ప! గద్యం వందిమాగధులు పాడేవారనుకుంటా, పాత కాలంలో రాజులకీ వాళ్లకీ! ఇప్పుడు పద్యాలు, కవులు వందిమాగధుల్లా రాస్తున్నారు! పాడుతున్నారు! ఉన్నారు! ఉన్నారు! అవునూ 'మదీయవారు వంబిం'కను రాదేం? మది చింత నొందుచున్నదే! మతి, శ్రీమతిపై కేగు చున్నది!......

...'రావయ్యా బాబూ! గాలికి పంపితే గంట కొట్టావు! 'పాచీ' వేయిస్తున్నానని చెప్పావమకో!' 'అయినా యింత ఆలస్యమా?'...పేచీ పెట్టుకు కూర్చున్నాడా, కొట్టునాడు ఎవడితోనో!...'బావుంది! బావుంది నీ 'పాచీ' 'పేచీ'!' ఇదిగో! యింకో అర్ధ రూపాయి తీసుకో! ఇకలింపెందుకు! మిగిలింది యీసారి చూద్దాం!'......

......ఛల్, మోహావరంగా, నీకు నాకూ', వెధవ అలవాటు ప్రతి పనికీ తోడు సినిమాలు పాట వుండితీరాలి కాబోలు! అయినా ఆఫీసునుంచి ఇంటికి యింత తొందరగా వచ్చేసేనేమిటి? ఆలోచనలలో

ప్రయాణించుచు మనోవేగమున, నేతెంచుచుంటినా? అయినా మనస్సుకు, బాహ్యపరిస్థితులకు హస్తిమశకాంతరము లేదా వేగమున?

'మణీ! ఓ సుగుణాలఖనీ! శారదామణీ! నీ భర్తామణిని చూడుము! ఎట్లుండెనో పరికించుము!'

'అబ్బ! ఎంతకీ వూడిపడడేం! మధ్యాహ్నం యింటికి రాలేదని అలకాగృహ పరిపాలన చెయ్యటం లేదుకదా' గావు కేకలు కావివి, భామామణీ! పంలషపు భీకర నాదాలు! 'ఏ భర్త తొందరలోనే డి॥ తా॥ అయిపోవును!...'ఛ ఛ! నీ యింగ్లీషు పరిజ్ఞానం ఏడిసినట్టే వుంది! డి॥ తా॥ అంటే 'డెత్' కాదు డిప్యూటీ తాశీల్దారు! నమ్మవా నా మాట వెలదిరో!...రామ రామ! ఈ ఆడవాళ్లెప్పుడూ యింతే! ఛస్తే మనం చెప్పింది వెంటనే నమ్మరు! ప్రక్కవాళ్లు చెబితే అర క్షణంలో నమ్ముతారు! మళ్లీ దాన్ని కాదని ప్రూఫ్ చెయ్యటానికి మన తాతలు దిగిరావాలి 'హా! నిజంగానే యీసారి డిప్యూటీ అవుతున్నా! చూసుకో నా తడాఖా! ఏం లేకపోతే ఎందుకు మధ్యాహ్నాలు తిండి గూడా మానేసి పని చేస్తున్నాము? ప్రభుత్వంవారంత కృతఘ్నులనుకొన్నావా? లోపలికి నడు!...

## భాగం 5

...అబ్బబ్బ' ఈ రోజు యెంతశ్రమపడ్డాను. శ్రమ శ్రమ! మశ్ర! పడ్డాను! పడ్డాను! అదృష్టం కాకపోతే, అవునూ 'వాణిశ్రీ' యెక్కడో జవాబుల్లో శ్రమకితోడు అదృష్టం కూడా కలిసొచ్చి యింత దాన్నయ్యాను అందికదూ! మరి మనం రేపు డిప్యూటీ అయితే ఎవడూ ఆ సంగతి మనని ప్రశ్నించడా? నేను జవాబుల్లో ఆ సంగతి చెప్పే మార్గం లేదే! నేను ఏ సినిమా స్టారునూ కానప్పుడు, నన్నెవడూ ఎందుకడుగుతాడా ప్రశ్న? అయినా వాళ్లకి మన జవాబులు కావాలా?...అచ్చులో పేరు చూసుకోవ



లనేనాపిచ్చి! అంతే! అంతే!... ఇంతకీ గాడితప్పా! ఆ... అదృష్టం కాకపోతే ఆఫీసరుగారి సతీమణి నన్నేల ఎరుగ వలెను? ఎరిగెనుబో నాపై అప్యాయత నేల చూప వలెను! చూపెనుబో ప్రమోషు నిప్పిస్తానని ప్రామిస్ నేలచేయవలెను?......హు! అపవయ్యా బాబూ! ఈ 'బో' వాక్యాలతో రోజంతా బోర్‌కొట్టేలా వున్నావు ఉ! అది నా భాగ్యం! అంతే! 'సిరిదావచ్చిన వచ్చును సలలితముగ నారికేళ సలిలము భంగిన్!' అంతే అంతే! 'ఓయ్ మణికుమారీ! నీ ప్రాణేశునకు కొంచెము కాఫీ దాహమిమ్ము!' 'మధ్యాహ్నము యింటికి రాలేదని కోపమేలనే భామా! నేను నీ వాడను, కానా? నన్నేరి కోరి నవ్వు చేసట్టలేదా?' 'ఔరా ఎంతమాటంది!' 'చేపట్టేలేదు, కాలిపట్టే లేదు' అందా!' కాలికి క్రొత్త మోడలు పట్టాలు కొనలేదనేకదా ఆ కోపం! 'హా! డిప్యూటీ తాశీల్దారు కాగానే వెధవది! వొక్క కాలికే యేమిటి వంటినిండా పట్టునన్ని పట్టాలు చేయించనా' 'ఒట్టినే కోపపడబోకు మోయింతీ! నీపతి తొందరలోనే డిప్యూటీ తాశీల్దారు కాబోవుచున్నాడు. అప్పుడు పట్టాల తప్పక కొంటాడు'...అయ్! అయ్! నీ పతి దేవునే ధిక్కరించుచుంటివా? 'మన మొహా లకు అదొక్కటే తక్కువా' అంటున్నావా? పైగా నవ్వుకూడనా?'...అమ్మ ఎంత మాటందిరా బాబూ! ఈ ఆడవాళ్లు మాటల యీాటెలు, విసరటంలో నిజంగా శక్తి స్వరూపిణిలే! చెలం చెప్పినట్టు మొగవాడు సుఖపడాలన్నా, దుఃఖపడాలన్నా కీలకం స్త్రీలోనే వుంది! అరుణకీ యీామెకీ ఎంత తేడాయో! ఎప్పుడూ నవ్వటం, నవ్వించటం అరుణ సహజ స్వభావ మైతే, ఎప్పుడేనా నవ్వటం యీావిడ సహజ స్వభావం! మొదట్లో యిలా వుండేదికాదు సుమా! నా అడుగు లకు మడుగులొత్తుతూ, అనుక్షణం నా ఆజ్ఞ కను క్కుంటూ, క్షణం విడువకుండా వెంట తిరిగేది! పిల్లలు పుట్టినప్పటినుండి 'చిరుబురు లేమనకిగతి! చినరామయ్యా!'......

ఎవడో, ఎక్కడో రాయనే రాసాడు పిల్లలు పుట్టేవరకూ భర్తమీద, ఆ తరవాత పిల్లల మీదకు స్త్రీల ప్రేమ ఆటోమాటిక్‌గా మారిపోతుం దట! అందరి విషయంలోనూ యింతేనా? కాదేమో! అరుణ పిల్లలున్నా భర్తతో ఎంతో ప్రేమగా వుంటుందే! రోజుకి నాలుగుసార్లేనా శ్రీవారికి ఫోన్ చేస్తేనే కాని ఆమెకు తోచదే! 'కనుక అరుణ మామూలు మానిసి కాదు!' 'కాదోయ్! వెర్రి రామా రావ్! మామూలు మనిషే అయితే తన భర్త దగ్గర పని చేస్తున్నందుకు నిన్నో పురుగులా చూసి వుండేది!'...ఆమె దేవత కనకనే, పదేళ్ల క్రిందటి కాలేజీ పరిచయాన్ని, స్నేహాన్ని, మరిచిపోక వాళ్ల నాన్నగారితో చెప్పి నీకు ప్రమోషనుకి రికమెండ్ చేయిస్తానంది!...'నిజం! నిజం! నా మనసా నీవన్నది నిజం నిజం!' అరుణదేవత! అరుణదేవత! దేవత అరుణ! 'నా అరుణాదేవీ!' 'హా! ఆ నాటకాల డైలా గులు చాలు కానీ నా ఆకలి సంగతి చూస్తావా అంటున్నాడు ఆకలిగాడు' 'ఒస్తున్నా నొస్తున్నా నయ్యా! నీ సంగతి చూడ్డానికే వస్తున్నా!' 'పాపం ప్రొద్దున్నే కాఫీ పొడుం అయిపోయిందని చెప్పిందా మణి? ఇప్పుడు నేను కాఫీపొడుం లేకపోయినా తను కాఫీ తెచ్చియిచ్చింది!' నా ఆలోచన గ్రహించి నవ్వు తోంది! ఎంత గ్రేస్‌ఫుల్‌గా, నా తప్పుల్ని క్షమిస్తుంది! నవ్వితే మణి ఎంతో బావుంటుంది! కాని యింట్లో నవ్వడం తగ్గించుకుంది...ఎందుకని? 'నారీ లోకం' పత్రిక ఎడిటర్ కదా! మరి గంభీర స్వభావం తెచ్చి పెట్టుకోకపోతే ఎలా? అందుకని 'నవ్వులన్నీ, మేగ జైను చందాదారులకీ, పేట్రన్స్‌కీ!'......'వినుగూ చిరాకూ, మనకి!' 'లేడీ ఎడిటర్'గారు యిలా చేస్తు న్నారు. సరే! పురుష పుంగవులూ యింతేనా? 'ఏమో! ఇది స్త్రీలు చెప్పవలసిన విషయం! మనకు తెలియదు కనుక నోరు మూసుకోవటం మంచిది!'...

...ఎన్ని కాఫీ ఎడ్వర్‌టైజ్‌మెంట్లు చదివినా వొక కాఫీ పొడానికి యింకోదానికి తేడా తెలీదు నాకు, కాఫీ త్రాగేటప్పుడు! నాకేనా అందరికీ యింతేనా? ఏమో ఎవరి సంగతో ఎవరి కెరుక?

...ఓయ్! ఓయ్! వచ్చే వచ్చే! ఇప్పుడే వస్తున్నా బాత్‌రూములోకి! లైఫ్‌బోయ్ కొనుక్కొస్తే

బావుండునే! 'ఆటల్లో, బురదలో, మట్టిలో తిరిగినా లైఫ్‌బాయ్‌తో స్నానం మీ ప్రాణానికి యెంతో... 'ఏదో వుండాలి డాక్యుమెంటరీలో బొంగురు గొంతుక పాట! అలా నటించటానికి ఆ కుర్రాడూ. పెద్దతను ఏం తీసుకున్నారో! అది లైఫ్ 'బోయ్'కదా! అంటే ప్రాణాన్ని రక్షించేది కనుక ప్రాణం అపాయంలోవున్న వాళ్లు వాడాలి దాన్ని! మరయితే నేనెందుకు కొనాలను కున్నానుముందు? ఏమో!......

ఇదిగో, యీ మైసూరు శాండల్ సోపును చూడండి! చక్కటి, చిక్కటి, చందన సువాసన! ప్రపంచంలోకంతటికీ అతిమంచి చందనం మైసూరులో మాత్రమే లభిస్తుంది. ఆ చందనం నూనెతో చేయబడిన అత్యంత సుందరమైన సబ్బు! దీన్ని నేడే కొనండి! నేడే! నేడే!' ఈ అడ్వర్‌టైజ్‌మెంట్ చూడగానే పట్టుకొచ్చానీ సబ్బును! తీరాచూస్తే మా శ్రీమతీ వో సబ్బు తెచ్చింది! ఈ వొక్క సబ్బ మాత్రం అడ్వర్‌టైజుమెంటుకు న్యాయం చేస్తోన్నట్టుంది! ఒక ప్రభుత్వ ఫాక్టరీ తయారుచేసిన సబ్బు యింత ప్రఖ్యాతి పొందటం, అందులోనూ నిత్యావసర వస్తువుల విషయమున, యీ భారత దేశంలో యెంత వింత! ఇది మిగిలిన ప్రభుత్వ పరిశ్రమలకెల్ల ఆదర్శప్రాయమై వానినికూడ యీ విధముగ నడిపించునుగాక! అందుచే భారతదేశము పరిశ్రమల రంగమున ప్రపంచ ప్రఖ్యాతి పొందునుగాక!

'అల్లాగే! అల్లాగేమణీ! క్షణంలో వచ్చేస్తున్నా!' వెధవటవలు, మరీ గరుకుగా వుంది; మంచి టర్కీటవలొకటి కొనాలి!' 'మెత్తగా వొంటిని హత్తుకుని సేదతీర్చే అచ్చమైన 'బిన్నీటర్కీటవల్స్'నే వాడండి!' వాడదాం! వాడదాం! 'వాడతాను సార్! డి. తా. ని కానివ్వండి. టర్కీ టవల్సు మాత్రమే యేమిటి, టర్కీ దుప్పట్లే వాడుతా! వాడుతా...తా!'

...అమ్మయ్య! అద్దం ముందు అలంకరణ తెమిల్చి యిప్పటికి కదా భోజనాని కొచ్చాను! మణి అరగంటనుంచి గంట వాయించినట్టు గొడవ పెడుతున్నా యింత ఆలస్య మెందుకైంది?...ఏవుంది! అద్దంలో మనం డి॥ తా॥ అయ్యాక చూపించవలసిన హావభావాలు ప్రాక్టీసు చేస్తూంటే ఆలస్యమైంది!... 'హహహ!' ఎవరిదీ వికటాట్టహాసము? 'ఎందుకురా రాక్షసాధమా ఆ నవ్వు? నాలోనే వుండి నన్నెదిరించు సాహసమా? 'సాహస విక్రమార్కుడి తమ్ముణ్ణిరా నేను!' 'నీ పీచ మడంచెదను!'...ఏవిటి! 'ఆలు లేదు చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం' అంటున్నావా? 'హహహ!'...వెర్రి వెధవా! అజ్ఞానరామా! నాకు 'ఆలు' వుందిర! ఆ ఆలుకు 'చూలూ' వుంది! నాలుగో నెల అని మరిచావురా గాడిదా! పోతే యింక నా కొడుకు పేరు అంటావా? మావాడి పేరు సోమలింగం కాద! సోమసుందరం! ఇంకోడు పుట్టగానే సోమలింగం' అని పేరుపెట్టి నీ కోరిక తీర్చి, సామెత నాకు వర్తించదని రుజువు చేస్తాను! కనుక యీపాటికి నీ అతితెలివి చాలించి వ్యంగోక్తులు కట్టిపెట్టి, నోరు మూసుకు పడుకో!' 'హహహ' వెధవని దెబ్బతో చిత్తు చేసేసా!...హహహ! 'అబ్బే ఏంలేదు మణీ! వూరికే నవ్వా! పిల్లలు భోంచేసి పడుకున్నారా! మంచిపని చేసారు! నువ్వు కూడా తొందరగా భోంచెయ్యి! కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకుందాం! ఎన్నాళ్లైంది మనిద్దరం యిలా వొంటరిగా కూర్చొని!

...అబ్బో! మణి ఎంత ముద్దుగా వుంది! ఎందుకో ముసి ముసి నవ్వులు నవ్వుతోంది. ఈమె నవ్వు మొహం చూస్తోంటే అరుణ గుర్తొస్తోంది! ప్రియునివద్ద......' మణికి నేనిప్పుడు ప్రియుడిగా కనిపిస్తున్నానా, వొట్టి మొగుడుగా మారిపోయానా? ప్రియుణ్ణి కాకపోతే యీ వంటింట్లో సిగ్గుల ముగ్గులు ఎందుకు పెడుతుంది?...అవునూ! అరుణ సంగతి యీమెకి చెప్పనా?...'ఒద్దొద్దురోయ్ రామారావ్! అనవసరంగా ఆమె మూడ్ చెడగొటకు! స్త్రీ దగ్గర, ఆమె గురించితప్ప యింకోళ్ల గురించి, ఆమె మంచి మూడ్‌లో వుండగా చెప్పావో, నీ పని గోవిందా! నీకిప్పుడు మూడిందన్న మాటే! ప్రస్తుతానికి నోరు మూసుకుని 'సెయిల్ ఎలాంగ్ విత్ హెర్!' కొంచెం పొగడ్తకానీ!'

'మణీ! నా హృదయరమ్మణీ! పదేండ్లుగా నన్ను పరిపాలిస్తున్న సుగుణాలఖని! నీకీ రోజున యీ దీనుడిపై యింత అకారణ అనుగ్రహము కలుగుటకు, కతంబేమి?'...'ఓహో! అల్లాగా! గుడ్ న్యూస్! కంగ్రాచ్యులేషన్స్! 'నేనూ—మావారూ' అన్న నీ వ్యాసానికి పోటీల్లో ఫస్ట్ ప్రైజొచ్చిందా? 'అయిదు వందల రూపాయలే!' అబ్బో! శహభాష్! నీకు పరమ సంతోషంగా వుంది! నేను కవిని; కథకుణ్ణి కాలేక పోయినా, నువ్వు రచనా వ్యాసంగంలో పురోగమించడం నాకు విపరీతమైన గర్వంగా వుంది! (నిజంగా వుందిరా, రామారావ్! జెలసీలేదూ 'ఛ నోరు ముయ్యరా లోని మనిషీ! 'ఒట్టి 'సినిక్'గా తయారవుతున్నావీమధ్య! నన్నే నమ్మలేవా?) 'నీవు నా అర్ధ భాగానివి మణీ! నీకువచ్చిన గౌరవంలో సగం నాదీను! అందులో వ్యాసానికి టైటిల్ కూడా ఏం పెట్టావ్! 'నేనూ—మా వారూ..! ఓహో! అందులోకూడా అర్ధభాగం నేను! అందుచేత...'నర్థకు! అబ్బే! అబ్బే! నీ ప్రైజులో అర్ధభాగం నా కొద్దులే!' నీ అభీష్టాను సారమే ఆ సొమ్ము ఖర్చు కానిమ్ము!...'కొంచెం కొబ్బరికాయ పచ్చడి వెయ్యనా? నవ్వకు మరి! నీకు సాయం చెయ్యటం భర్తగా నా విధి!'...'ఇన్నాళ్లూ అది మరిచిపోయేరే అంటున్నావా? 'ఊహల గాలి మేడల్లో, ఆకాశపు టంచులపై విహరించే నాకు, నేలపై ఆధారం నువ్వే కదా మణీ!'...'మణీ! నేను చాలా అదృష్టవంతుణ్ణి తెలుసా! ప్రపంచంలో అరుదుగా లభించే (ఒరేయ్ రామారావ్! అరుణ సంగతి చెప్పొద్దన్నానా! ఛంపేస్తాను!) అబ్బే ఏంలేదు! అల్లాంటి భార్యామణిని లభించావు నాకు! ఈ మధ్య బాగుపడ్డం కూడా నేర్చుకుంటున్నా. ఆపలేని అన్యాయాలకై బాధ పడటం మానేస్తున్నా! 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్' అక్షరాలా పాటిస్తున్నా!...'కంచాలల్లా వదిలేద్దూ! రేప్రొద్దున్నే కడుక్కోవచ్చు! కమాన్ డార్లింగ్! ఓ గంట సరదాగా కబుర్లు చెప్పుకుందాం!'

...మణి ఎంత కులాసాగా కబుర్లు చెబుతోంది! నేను వినటంలేదేమో అన్న అనుమానం కూడా లేదే! 'పూర్ మణీ!' 'వెర్రి రామం! మణి యిప్పుడు 'పూర్' కాదోయ్! అయిదు వందల కధిపతి! నీ 'ఫెస్టివల్ అడ్వాన్స్', 'సరెండర్ లీవ్ శాలరీ' కలిసినా అంత రాదు!'...అయినా, 'సంతోషానికి' కారణం యేమిటో! మన కోరికలలో కొన్ని తీరటమేనా?.. ఇంకా చాలా తీరకుండా ఉండిపోతున్నాయిగా? వాటికోసం యేడవటం లేదేం? 'తీరగలిగినవికూడా. తీరకపోతేనే, ఏడుస్తాంలా వుంది!' తీరనివి ఎల్లాగూ తీరవని తెలిసి ఊరుకొంటాంలా వుంది! అంతేనేమో...'ఊ! ఊ! వింటున్నా మణీ! అబ్బ! రాయటానికి చాలా కష్టపడ్డావన్న మాట!'...కష్టం! కష్టం! రంగయ్యకి నేను కలిగించిన కష్టం, నష్టం ఎలా తీరతాయి? రంగయ్యకి అలా చెయ్యకపోతే నాకు కలిగే నష్టాలు, కష్టాలు ఎవడు తీరుస్తాడు?.. అవునూ, కష్టాలు మన పరిస్థితుల్నిబట్టి మారుతాయా? ప్రమోషన్ వొస్తుందన్నాక రాకపోతే కష్టం! అసలు ప్రమోషనే లేదంటే కష్టమే లేదుగదా అప్పుడు...' అయితే మన చుట్టూ వున్న పరిస్థితుల్నిబట్టీ, మన అనుభవాల్నిబట్టీ మన మనసులో భావాలు మారుతూ వుంటాయా?' అయితే కష్టానికి సుఖానికీ కొలత బద్దయేది? వాటిని నిర్వచించటానికి సూత్రం యేది? ఏమో! ఏదేనా పత్రికకు రాసి కనుక్కోవాలి. ఎవరో ఒక మహిళా మణి జవాబీయకపోదు... రంగయ్య.. ఛ్ఛ! పాపం రంగయ్య!...' నన్ను క్షమించు రంగయ్యా! నీ బ్రతుకు బాగుచెయ్యబోయి నా బ్రతుకు పాడు చేసుకోలేను!'......

'అహహ! బాగా చెప్పావ్ మణీ! వండర్‌ఫుల్.

(అయిపోయింది)